## క్లుప్తంగా

### విద్యుదాఘాతంతో గేదె మృతి



కళేబరం వద్ద బాధిత రైతు

తాండూరు రూరల్: విద్యుదాఘాతంలో ఓ గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చెంగోల్‌లో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల మోనప్ప గేదెను అల్లాపూర్ శివారులోని ఓ పొలంలో మేతకు సోమవారం తీసుకెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంలో అది అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

### విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

మోమిన్‌పేట: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని టేకులపల్లి ఉన్నత పాఠశాలలో 69వ ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలలో రాణిస్తే భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, ప్రధానోపాధ్యాయులు గౌరిశంకర్ తదితరులు ఉన్నారు.

### ఇన్‌చార్జి ఎంపీఓగా వీరన్న



తాండూరు రూరల్: మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ) ఇన్‌చార్జిగా వీరన్న బాధ్యతలు సోమవారం చేపట్టారు. గతంలో పని చేసిన ఎంపీఓ సునీల్‌కుమార్ వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌డీఏకు బదిలీపై వెళ్లారు. దీంతో చెన్‌గేస్‌పూర్ పంచాయతీ కార్యదర్శి వీరన్నకు ఇన్‌చార్జి ఎంపీఓగా నియమిస్తూ డీపీఓ ఆదేశాలు జారీ చేశారు. ఎంపీడీఓ విశ్వప్రసాద్ సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

### వనమహోత్సవానికి సిద్ధం



మొక్కలు నాటేందుకు గోతులు తీస్తున్న కూలీలు

దుద్యాల్: వన మహోత్సవానికి అధికారులు సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో సోమవారం కొత్తగా మొక్కలు నాటేందుకు ఉపాధి కూలీలు గుంతలు తీశారు. ప్రధాన రోడ్ల గుండా పచ్చదనం ఉట్టి పడేలా ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందుతుందనే భావనతో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పనులను గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, ఏపీఎం రాములు పరిశీలించారు.

### అనుమతి ఇవ్వండి



ప్రిన్సిపాల్‌కి సూచనలు చేస్తున్న బీజేపీ నేతలు

కుల్కచర్ల: విద్యార్థుల ఇష్టానుసారంగా వినాయక ప్రతిమను పెట్టుకునేందుకు అనుమతి ఇవ్వాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటయ్యముదిరాజ్, దిశ కమిటీ జిల్లా సభ్యుడు జానకిరాం అన్నారు. సోమవారం ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ జ్యోతిహెప్సిభా ను కలిసి విద్యార్థుల మనోభావాలను గౌరవించాలని సూచించారు. ఏటా నిర్వహించుకునే పండగను కొత్తగా నిరాకరించడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో బిచ్చయ్య, నరేష్, మహేష్, విజయేందర్‌రెడ్డి, మల్లేష్, వెంకటేష్, శివకుమార్, జస్వంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### క్షయపై అప్రమత్తంగా ఉండాలి

బంట్వారం: క్షయపై అప్రమత్తంగా ఉండాలి కోట్‌పల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మేఘన అన్నారు. టీబీ ముక్త్‌భారత్ అభియాన్‌లో భాగంగా సోమవారం కోట్‌పల్లి, అన్నాసాగర్, ఇందోల్, ఓగులాపూర్ గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. టీబీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె ప్రజలకు వివరించారు. అనంతరం పలువురిని వ్యాధి నిర్ధారణ పరీక్షలకు తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఖయూం, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, స్థానిక ఏఎన్ఎం అపర్ణ, ఎల్టీ నర్సింహ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ఉరుకులు.. పరుగులు

**ఎఫ్‌ఆర్‌ఎస్‌తో ఉదయమే బడికి ఉపాధ్యాయులు**

- రెండుపూటలా హాజరుతో డుమ్మా కొట్టేందుకు నో ఛాన్స్
- మంచి పరిణామమంటున్న పలువురు విద్యావేత్తలు



ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో హాజరు నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

దౌల్తాబాద్: ఉపాధ్యాయులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్(ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్) యాప్ ద్వారా టీచర్ల హాజరు నమోదు చేస్తుంది. ఉదయం 9గంటలకు.. సాయంత్రం 4.15 గంటల తర్వాత రెండు సార్లు ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో మొన్నటి వరకు ఇష్టారాజ్యంగా పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు ఇప్పుడు ఉదయం 9గంటల్లోపే స్కూల్‌కు వెళ్తున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా ఆన్‌లైన్ అటెండెన్స్ చూపిస్తుండడంతో ముందుగానే బడికి చేరుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థులకు మేలు జరుగుతుందని పలువురు విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

**సాకులకు చెక్**

మొన్నటివరకు ఉపాధ్యాయులు కొందరు పాఠశాలకు ఆలస్యంగా వెళ్లేవారు. ఒకవేళ హెచ్‌ఎం అడిగితే కొందరు ఎదురుతిరిగేవారు. మరికొందరు రాజకీయ నేతల అండతో ఇష్టమొచ్చినట్లు వ్యవహరించేవారు. కొంతమంది హైదరాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట నుంచి వచ్చేవారు. వారు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి ఉండేది. ఒక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటే ఒకరు ఒక రోజు.. మరొకరు ఇంకో రోజు పాఠశాలకు వెళ్లేవారు. సాయంత్రం 4గంటలు కాకముందే ఇంటిబాట పట్టేవారు. బస్సులు దొరకడంలేదనే సాకుతో ముందే తోటి ఉపాధ్యాయులకు చెప్పి బడి నుంచి కొందరు బయటపడేవారు. వీటన్నింటికీ ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్ యాప్ చెక్ పెట్టంది.

**నిర్ణీత సమయం పాటించాలి**

ఉదయం 9 గంటల్లోపు ఉపాధ్యాయులు వారు పని చేస్తున్న పాఠశాలలకు వెళ్లి ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో అటెండెన్స్ వేసుకోవాలి. ఆ పాఠశాల ఆవరణలో ఉండి అటెండెన్స్ వేస్తేనే ఫొటో క్యాప్చర్ అవుతుంది. 9గంటలకు ఒక్క నిమిషం దాటినా యాప్‌లో అటెండెన్స్ ప్రెసెంట్ అని చూపినా పక్కన రెడ్ మార్కు చూపుతుంది. అలాగే సాయంత్రం 4:15 గంటల లోపు వెళ్లినా హాజరు తీసుకోదు. దీంతో ఉపాధ్యాయులు పాఠశాలకు పూర్తి సమయం కేటాయిస్తున్నారు.

**సెలవులూ ఆన్‌లైన్‌లోనే**

ఏ ఉపాధ్యాయుడైనా తనకు సెలవు కావాలంటే గతంలో లిఖిత పూర్వకంగా లేదా మౌఖికంగా హెచ్‌ఎంకు చెప్పి తీసుకునేవారు. హెచ్‌ఎం సెలవు కాదంటే లీవ్ లెటర్ రాసి స్కూల్‌లో పెట్టి వెళ్లిపోయేవారు. కానీ అందుకు కాలం చెల్లింది. సెలవు కావాలనుకునే ఉపాధ్యాయుడు ఈ యాప్‌లోనే సెలవు పెట్టుకుంటే అది స్కూల్ హెడ్‌మాస్టర్‌కు వెళుతుంది. హెచ్‌ఎం ఆమోదిస్తేనే సెలవు తీసుకోవచ్చు. రిజక్ట్ చేస్తే కచ్చితంగా పాఠశాలకు హాజరు కావాలి.

**మంచి నిర్ణయం**



ప్రభుత్వం ఆలస్యంగానైనా మంచి నిర్ణయం తీసుకుంది. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలలన్నీ మెరుగుపడతాయి. ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు హాజరు అవుతారు. విద్యార్థులు కూడా సమయానికి వస్తారు. తర్వాత పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరిగే అవకాశం ఉంది. ఇది మంచి పరిణామం.

– రాజు, జెడ్పీహెచ్ఎస్ బాలంపేట హెచ్‌ఎం

# సత్యాగ్రహ దీక్షలో బీసీ నేతలు

అనంతగిరి: స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ. ఆర్ కృష్ణయ్య చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు జిల్లా నుంచి బీసీ నాయకులు తరలివెళ్లారు. ఇందులో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఆర్ కృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**తరలివెళ్లిన బీసీ నాయకులు**



ఆర్.కృష్ణయ్యకు సంఘీభావం తెలుపుతున్న బీసీ నాయకులు

తాండూరు టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద బీసీ సంఘం జాతీయాధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తలపెట్టిన సత్యాగ్రహ దీక్షలో సోమవారం పలువురు తాండూరు బీసీ నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ షుకూర్ తదితరులు ఆయనను కలిసి సంఘీభావం తెలియజేశారు. అనంతరం రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. నాయకులు వెంకటేష్, పవన్, సత్తార్, శ్రీశైలం, వివేక్, మల్లేశం, జీషాన్, గోపాలకృష్ణ, రాఘవేంద్రాచారి, రాములు తదితరులు సత్యాగ్రహ దీక్షకు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

### కంప్యూటర్ల అందజేత

బొంరాస్‌పేట: మండలంలో ఏఐ కింద ఎంపికైన ప్రాథమిక పాఠశాలలకు సోమవారం కంప్యూటర్లను ఎంఈఓ హరిలాల్ అందజేశారు. మొదటి విడతలో 10 పాఠశాలలు ఎంపిక అయ్యాయని, అందులో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. కుర్చీలు, బెంచీలు నేరుగా పాఠశాలలకు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు మల్లేశం, లక్ష్మయ్య, సీఆర్‌పీ సోమ్లా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### తరలుతున్న గణపయ్యాలు



ట్రాక్టర్‌లో గణపయ్యను పల్లెలకు తీసుకెళ్తున్న చిన్నారులు

తాండూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా సందడి నెలకొంది. తాండూరు పట్టణంలోని వినాయక తయారీ సెంటర్ల నుంచి గణనాథులను పల్లెలకు తరలిస్తున్నారు. సోమవారం చిన్నారులు తమ గణపయ్యను ట్రాక్టర్‌లో వారి గ్రామానికి తీసుకెళ్తున్నారు. గ్రామాల్లో ఇప్పటికే మండపాలను సిద్ధం చేశారు. వాడవాడలా పండుగ వాతావరణం నెలకొంది.

### భక్తిశ్రద్ధలతో వరాహస్వామి జయంతి

కొడంగల్ రూరల్: పట్టణంలోని పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో వరాహస్వామివారి జయంతిని సోమవారం ఆలయ ధర్మకర్తలు, పురోహితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, దూపం, దీపం, నైవేద్యాలను సమర్పిస్తూ మంగళహారతులు అందించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

### రోడ్డు విస్తీర్ణం తగ్గించండి





కలెక్టర్ కార్యాలయం వద్ద పోలేపల్లి గ్రామస్తులు

దుద్యాల్: వంద ఫీట్ల రోడ్డుతో తీవ్రంగా నష్టపోతామని మండల పరిధిలోని పోలేపల్లి గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. సోమవారం గ్రామానికి చెందిన కొందరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో భాగంగా 100 ఫీట్ల రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రతిపాదించింది. నాలుగు లైన్ల రోడ్డు ఏర్పాటుతో ఇరుపక్కల ఉన్న మా ఇళ్లు పూర్తిగా పోతున్నాయని వాపోయారు. రోడ్డు విస్తీర్ణం తగ్గించాలని కోరారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



పరిగి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



ధారూరు: ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

**బీజేపీ నాయకుల ధ్వజం**

పరిగి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ పార్టీ మండల అధ్యక్షురాలు నీరటి అనసూయ ఆరోపించారు. సోమవారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ప్రజా సమస్యలపై తహసీల్దార్ వెంకటేశ్వరికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పరిగి మండలంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల్లో నస్కల్ రోడ్డులోని చిన్న వాగు బ్రిడ్జి నిర్మాణం చేస్తామని చెప్పి ఇప్పటి వరకు పనులు చేయడం లేదన్నారు. ప్రజా సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యలపై ర్యాలీ**

ధారూరు: ప్రజా సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ సాజిదాబేగంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ.. ధారూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని, ధారూరు–చింతకుంట గ్రామాల మధ్య వాగుపై నిర్మించిన అసంపూర్తి వంతెనను పూర్తి చేయాలని తదితర సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్, జిల్లా దిశ కమిటీ సభ్యుడు వడ్లనందు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలపై బీజేపీ నేతల ఫిర్యాదు**

బంట్వారం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నాయకులు సోమవారం బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆర్అండ్‌బీ రోడ్లు అధ్వానంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారయిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మహేష్, శివకుమార్, ప్రధాన కార్యదర్శి మల్లేశం, నాయకులు వెంకటేశం గౌడ్, నందు, పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి**



యాలాల: నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

యాలాల: మండలంలో దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం మండల కేంద్రం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలంలో ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లు దెబ్బతిని వాహనదారులు, ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు శివకుమార్, నాయకులు విజయ్‌కుమార్, అశోక్, దస్తప్ప, యాదగిరి తదితరులు ఉన్నారు.

### పత్తి పంటల పరిశీలన

కొడంగల్ రూరల్: ఇటీవల కురిసిన అకాల వర్షాల నేపథ్యంలో మండల పరిధిలోని రుద్రారం, నాగారం గ్రామాల్లో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం జిల్లా శాస్త్రవేత్తలు సోమవారం పర్యటిస్తూ రైతులకు పలు సూచనలు అందించారు. పత్తి పంటలపై దుష్ప్రభావం కలిగే పరిస్థితులను పరిశీలించేందుకు డయాగ్నోస్టిక్ ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. పత్తి పొలాలకు ఏర్పడిన వ్యాధులు, తెగుళ్లను గమనిస్తూ నియంత్రణ చర్యలను రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.తులసి, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీపతిరెడ్డి, ఇస్సాక్ హెరాల్డ్, రైతులు వెంకటయ్య పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాలనతో న్యాయం

దుద్యాల్: ప్రభుత్వ పాలనతో ప్రజలకు న్యాయం జరుగుతుందని మండల పరిధిలోని కుదురుమల్ల గ్రామ మాజీ సర్పంచ్ రఘుపతి అన్నారు. సోమవారం గ్రామానికి చెందిన ఈర్లపల్లి బాలరాజు ఇటీవలే హామీ పథకం కింద నిర్మించిన పశువుల షెడ్డుకు సంబంధించిన చెక్కును అందించారు. పంచాయతీ కార్యదర్శి రాధ, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు యాదిరెడ్డి పాల్గొన్నారు.

# ఏటీసీతో ఉజ్వల భవిష్యత్



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యాధికారులు, ప్రిన్సిపాళ్లు

తాండూరు టౌన్: తాండూరులో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని పలువురు మండల విద్యాధికారులు, ప్రిన్సిపాళ్లు, ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ సభ్యులు అన్నారు. సోమవారం పట్టణ శివారులో రూ.25 కోట్లతో నిర్మించిన ఏటీసీ కళాశాలను వారు సందర్శించారు. అనంతరం కళాశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చి నేటి ఆధునిక సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా కోర్సులను తీసుకురావడం శుభసూచకమన్నారు. కోర్సు పూర్తయిన వెంటనే 100 శాతం ఉద్యోగ భద్రత దక్కడం హర్షణీయమన్నారు. తాండూరు ఏటీసీ కళాశాలలో ఆరు కోర్సుల్లో 172 మంది విద్యార్థులకు చదువుకునే అవకాశం ఉందన్నారు. ఈనెల 28వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషితో ప్రభుత్వం పరికరాల కొనుగోలుకు రూ.65 కోట్ల నిధులు కేటాయించిందన్నారు. ఏటీసీ కళాశాల ప్రిన్సిపాల్ సాయన్న, పలు మండల విద్యాధికారులు వెంకటయ్యగౌడ్, నర్సింగ్‌రావు, రమేష్, రాములు ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు మల్లినాథప్ప, నర్సింహారెడ్డి, నర్సిములుతో పాటు ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ సభ్యులు రవీంద్ రెడ్డి, సుహాస్, శివ, మోహనకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సంతకం పెట్టను!

**నోడ్యూ సర్టిఫికెట్‌కు రోజుల తరబడి తిప్పుకొంటున్న బ్యాంక్ మేనేజర్**





నోడ్యూ సర్టిఫికెట్లపై మేనేజర్ సంతకాలు పెట్టడం లేదంటూ ఆరోపిస్తున్న రైతులు

ధారూరు: వారం రోజుల నుంచి తిరుగుతున్నాం.. నోడ్యూ సర్టిఫికెట్‌పై సంతకం పెట్టండి సార్ అంటూ రైతులు బ్యాంకు మేనేజర్‌కు మొరపెట్టుకున్నారు. సంతకం పెట్టాలన్న రూలేమైనా ఉందా, తర్వాత చూస్తానులే అంటూ దబాయించిన సంఘటన మండల పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొంత మంది రైతులు వివిధ రకాల రుణాల తీసుకునేందుకు ఆయా బ్యాంకుల నుంచి నోడ్యూ సర్టిఫికెట్ అవసరం. దాని కోసం దీనికి నాగారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌కు ఆశ్రయించగా.. రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. నిత్యం రేపుమాపంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఇదేంటని కొందరు ప్రశ్నిస్తే మీ దిక్కున్న చోట చెప్పుకోండి సమాధానం ఇవ్వడంతో అన్నదాతలు నిశ్చేష్టులయ్యారు. వాస్తవానికి నోడ్యూ సర్టిఫికెట్‌ను కోరితే నిమిషాల్లో చెక్ చేసి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ రోజుల తరబడి తిప్పుకోవడంపై కర్షకులు కె.వెంకటయ్య, సీహెచ్.యాదయ్య, క్రిష్ణ, యాదయ్య, పాషం.క్రిష్ణయ్య మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్ రమేశ్‌ను వివరణ కోరగా.. ఏ రైతుతో అలా మాట్లాలేదన్నారు. కొందరు కావాలనే ఇలా చేస్తున్నారన్నారు. రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత నోడ్యూ సర్టిఫికెట్లపై సంతకాలు పెడుతున్నానని తెలిపారు. వివిధ పనుల్లో ఉన్నప్పుడు సంతకాలు పెట్టమని ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు.

# ఆదర్శ రైతుకు అభినందన



లూసర్న్ గడ్డి సాగును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కొడంగల్ రూరల్: వైవిధ్య పంటలను సాగుచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రైతును వ్యవసాయాధికారులు అభినందించారు. మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామానికి చెందిన కొల్లేర్ నవీన్ సమగ్ర వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సోమవారం మండల వ్యవసాయాధికారి జి.తులసి, ఏఈఓలు అశ్విని, శ్రీపతి, ఐజాక్ హెరాల్డ్, రాజులతో కలిసి రైతు నవీన్ సాగుచేస్తున్న వివిధ రకాల పంటలను పరిశీలిస్తూ అభినందించారు. నాలుగున్నర ఎకరాల పొలంలో మొత్తం 13 రకాల పంటలను సాగుచేస్తున్నట్లు గుర్తించారు. పెసర, సెనగలు, కందులు, పల్లీలు, కందులు వరుసలుగా వేయగా, నువ్వులు, బంతి, ప్రొద్దుతిరుగుడు పంటలను సాగు చేస్తున్నాడు. రైతు నవీన్‌పై మండల వ్యవసాయాధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రైతులకు యూరియా అందించాలి

**రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్**



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నేతలు

కొడంగల్ రూరల్: రైతాంగానికి సరిపడా యూరియా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ బి.విజయకుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఫర్టిలైజర్స్ దుకాణదారులు యూరియా కొరత సృష్టిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆశమ్మ, రాజునాయక్, శైలజ, శంకర్‌నాయక్, బాబ్యనాయక్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# లగోరి పోటీల్లో విద్యార్థుల సత్తా



విద్యార్థులకు మెమెంటోను అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

దోమ: మహారాష్ట్ర రాష్ట్రంలోని చిప్లూర్ నగరంలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి లగోరి పోటీల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. 22 రాష్ట్రాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా రాష్ట్రంలోని వికారాబాద్ జిల్లా పరిధిలో ఉన్న దిర్సంపల్లి, ముజాహిద్‌పూర్, రాంనగర్, నారాయణపేట జిల్లాలోని కోస్గికి చెందిన విద్యార్థులు పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచారని రాష్ట్ర లగోరి అసోసియేషన్ కార్యదర్శి పి.నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో లగోరి చాంపియన్‌షిప్ హెడ్ కోచ్‌లు ఎం.విశాల్, సచిన్ మహిళా కోచ్ నవనీత తదితరులు పాల్గొన్నారు.

### టై, బెల్ట్ అందజేత





విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డులు, షు అందజేస్తున్న ఎంఈఓ వెంకట్

దోమ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి టై, బెల్ట్, ఐడీ కార్డులు, షులు పంపిణీ చేయడం అభినందనీయమని ఎంఈఓ వెంకట్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గొట్లచెల్కతండా గ్రామ పంచాయతీలోని మెట్టుగడ్డతండా పాఠశాలలో తండాకు చెందిన చందర్ విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డులు, షులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాకేశ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆనంద్, తండావాసులు పాల్గొన్నారు.

# అల్లాపూర్‌లో ఆధ్యాత్మిక శోభ



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. శ్రావణ మాసం ముగింపు సందర్భంగా సోమవారం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పల్లకిలో గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. ప్రత్యేక కీర్తనలు, భజనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అమర్‌నాథ్‌గౌడ్, విజయ్ కుమార్, గోపాల్‌రెడ్డి, పెద్ద నర్సిములుగౌడ్, నర్సిరెడ్డి, కిషోర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.